క్లుప్తంగా

'జోడు లింగాల' ఆలయం ముస్తాబు



జోడు లింగాల ఆలయానికి రంగులు వేసిన దృశ్యం

కూడేరు: దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన శివాలయాల్లో స్వయంభు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి ఆలయం ఒకటి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఈనెల 12న ఉదయం 11:05 గంటలకు మడుగు తేరు, సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవం జరగనుంది. దేవదాయ శాఖ అధికారులు జోడు లింగాల ఆలయాన్ని బుధవారం వివిధ రకాల రంగులతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ బాబు తెలిపారు.

వేతనాలు చెల్లించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం



అర్ధనగ్నంగా నిరసన తెలియజేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: తమ వేతనాలు చెల్లించేవరకూ ఆందోళనలు కొనసాగిస్తామని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని శ్రీరామిరెడ్డి పంప్ హౌస్ వద్ద నాలుగో రోజు అర్ధనగ్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకుంటే తామెలా బతకాలని వాపోయారు.

కణేకల్లు: పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనివి

ఉరవకొండ: లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనివని ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓ గౌస్‌సాహెబ్ కొనియాడారు. బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ వారు ఉచితంగా తాగునీటి, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్ర, జాబీర్, నగేష్, చందాకేశన్న, పీజీఎస్ నూర్, సత్యనారాయణ, బాలచందర్, నాగేశ్వరావు, సోమేఖర్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు దుర్మార్గం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేతకాని తనం వల్లే గ్యాస్ సిలిండర్, పెట్రో, డీజిల్ ధరలు పెరిగాయని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు మధు మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధర పెంచడం దుర్మార్గమన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా ధరలు పెంచుకుంటుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మురళి, సిద్దప్ప, వీరాంజనేయులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయ పాలన పాటించాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

రాయదుర్గంటౌన్: వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ, వైద్యులతో చర్చించారు. సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మాధవి, ఉమామహేశ్‌కుమార్, మోహన్‌సాయి పాల్గొన్నారు.

పార్కింగ్.. పరేషాన్!



వినాయక సర్కిల్‌లో పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు



పాత బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై పార్కింగ్‌తోపాటు చిరువ్యాపారాలు, లోడింగ్, అన్‌లోడింగ్



వినాయక సర్కిల్‌లో భయం భయంతో రోడ్డు దాటుతున్న మహిళలు

- బండి నిలిపేందుకు చోటేదీ?
- రోడ్లపైనే తోపుడు బండ్లు, వాహనాలు
- రోడ్డు దాటాలంటే ప్రజలకు దడే

రాయదుర్గంటౌన్: ద్వితీయశ్రేణి మున్సిపాలిటీ అయిన రాయదుర్గంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. తోపుడుబండ్లు, చిరు వ్యాపారాలు రోడ్లపైనే నిర్వహిస్తుండడంతో వాహనాలు నిలపడానికి పార్కింగ్ స్థలం కరువైంది. దీంతో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నియోజకవర్గ కేంద్రంతోపాటు కర్ణాటక సరిహద్దు కావడంతో రాయదుర్గానికి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. పట్టణంలో రోజుకు చిన్న, పెద్ద వాహనాలు కలిపి సగటున 30వేలకు పైగా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉదయం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతోంది. దీనికితోడు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి తగినంతమంది పోలీసులు కూడా లేరు.

రోడ్లపైనే పార్కింగ్

ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి లక్ష్మీబజార్, పాత బస్టాండ్ మీదుగా వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్లలో ఎక్కడ కూడా పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో దుకాణాలు,, బ్యాంకులు, వ్యాపార సముదాయాలకు వచ్చే వాహనాలను రోడ్లపై నిలెబట్టాల్సి వస్తోంది. ఫుట్‌పాత్ సౌకర్యం లేక ప్రజలు రోడ్లపైనే నడవాల్సిన దుస్థితి ఉంది. పార్కింగ్‌కు స్థలాలు చూపకుండా రోడ్డు విస్తరణ చేపట్టడం వల్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లపైనే వ్యాపారం

ఏరియా ఆస్పత్రి నుంచి గాంధీ సర్కిల్, వినాయక సర్కిల్, కూరగాయల మార్కెట్, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డుకు ఇరువైపులా సగం రోడ్డును ఆక్రమించుకుని తోపుడుబండ్లపై వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. పాదచారులు కూడా రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మరోవైపు ఆటోలకు ప్రత్యేక స్టాండ్ లేక వాటిని ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. ఫలితంగా వినాయక సర్కిల్, పాత బస్టాండ్, గాంధీ సర్కిల్, లక్ష్మీబజార్, ప్రభుత్వాస్పత్రి, బాలికోన్నతపాఠశాల ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

పార్కింగ్ స్థలాలు లేక సమస్య



పట్టణంలో వాహనాల పార్కింగ్ స్థలాలు లేకపోవడంతోనే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, పాత టవర్‌క్లాక్ నుంచి లక్ష్మీబజార్ వరకు వాహనాలు నిలబెట్టేందుకు అనువైన స్థలాలు లేవు. దీంతో నిత్యం పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తే చాలావరకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది.

– గోవిందరాజులు, వస్త్ర వ్యాపారి, రాయదుర్గం

ప్రత్యేక ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ



రాయదుర్గంలో ట్రాఫిక్ సమస్యను ప్రత్యేక ప్రణాళికతో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, పట్టణంలోని వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి పార్కింగ్‌పై చర్చిస్తాం. ఇది వరకే ట్రాఫిక్ నియంత్రణకు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాం. ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బందిని నియమించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

– జయనాయక్, సీఐ, రాయదుర్గం అర్బన్

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105 జయంతి సందర్భంగా సంస్థ డైరెక్టర్ మంచూ ఫెర్రర్, రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, ఆసుపత్రి డైరెక్టర్ రవి ప్రసాద్, డాక్టర్లు అశోక్, ఓంకార్, బాలసుబ్బయ్య, ఆసుపత్రి మేనేజర్ శ్రీనివాసులు ఫాదర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రి, ఫీల్డ్ కార్యాలయాలలో ఫాదర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఆర్డీటీ ఆసుపత్రికి వచ్చిన రోగులతో సౌకర్యాలపై మంచూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు స్వీట్లు పంచిపెట్టారు. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గంలోని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్‌ను మంచూ ఫెర్రర్ సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ట్రస్టు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. ఆర్డీటీ స్పందించు సాయమందించు కార్యక్రమానికి రూ.లక్ష చెక్కు అందజేశారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని నంజాపురం రోడ్డులో ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ఆయన జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ సంస్థ సభ్యులు ఫాదర్ ఫెర్రర్ సేవలను గుర్తు చేశారు. ఆర్డీటీ నెట్వర్క్ లీడర్లు మరియమ్మ, పార్వతి, సంఘం లీడర్లు, సీబీటీలు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆ సంస్థ ఏటీఎల్ సుశీలమ్మ, స్థానిక మహిళా సంఘసభ్యులతో కలిసి బుధవారం నివాళులర్పించారు. కనుకూరు, లక్ష్మంపల్లి, ములకలేడు తదితర గ్రామాల్లో ఫాదర్ జయంతిని నిర్వహించారు.



కూడేరు: జయపురంలో ఫెర్రర్‌కు నివాళులర్పించిన డైరెక్టర్ నిరంజన్, మహిళలు



ఫాదర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన మాంచూ ఫెర్రర్, స్థానికులు

కూడేరు: పేదలకు సహాయం చేయాలన్నదే ఫాదర్ ఫెర్రర్ లక్ష్యమని ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్ పేర్కొన్నారు. బుధవారం కూడేరు మండల పరిధిలోని జయపురం, చోళసముద్రం గ్రామాల్లో ఫాదర్ ఫెర్రర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఎల్ నల్లప రెడ్డి, సిబ్బంది నరసింహులు, సంజీవరాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉరవకొండ: బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి ఫాదర్ ఫెర్రర్ అని అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ మధు, జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాకే భాస్కర్, సమన్వయకర్త మీనుగ గోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఆర్డీటీ వ్యవస్థాపకుడు డాక్టర్ విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో యాక్షన్ కమిటీ సభ్యులు రాజశేఖర్, ఫత్వీ, పురుషోత్తం, చెన్నప్ప, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కంబదూరు: ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కురాకులపల్లిలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల ఉపాధ్యక్షుడు గోపాల్ ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుందుర్పి: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయాలను కొనసాగిద్దామని ఆర్‌డీటీ సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశా ఫెర్రర్ పేర్కొన్నారు. ఫెర్రర్ జయంతి సందర్భంగా ఆమె బుధవారం కుందుర్పిలోని ఫెర్రర్ ఆలయంలో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు అప్పిలేపల్లి ఆర్డీటీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు విశా ఫెర్రర్ ప్రకటించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు

ఉరవకొండ: పట్టణంలోని పలు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బుధవారం బెళుగుప్పలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉరవకొండలోని యాదవ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, వాల్మీకి కమ్యూనిటీ హాల్‌కు రూ.50 లక్షలు, కురుబ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు, శ్రీకృష్ణదేవరాయ బలిజ కమ్యూనిటీ భవనానికి రూ.20 లక్షలు, నాయీబ్రాహ్మణ కమ్యూనిటి భవనానికి రూ.30 లక్షలు, షాదీఖానా నిర్మాణానికి రూ.50 లక్షలు, భద్రావతి భావసురుషేంద్రుల కమ్యూనిటీ హాల్‌కు రూ.30 లక్షలు, కార్పెంటర్స్ వర్క్‌షెడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు, రెండు ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యాదవ సామాజిక భవనం అభివృద్ధికి రూ.15 లక్షలు మంజురు చేసిన మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు గణేష్ బాబు, చల్లా అనంత యాదవ్, ఎర్రిస్వామి, శ్రీరాములు, గోవిందు, సుధాకర్, సూరి, తిమ్మరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



మంత్రి కేశవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మెట్టు విశ్వ తదితరులు

డీ హీరేహాళ్(రాయదుర్గం): హొసగుడ్డంలో బుధవారం ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథం ముందు యువకులు చేసిన నందికోలు నాట్యం ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, సోములాపురం సర్పంచ్ సుదర్శనరెడ్డి, హొసగుడ్డం హనుమంతరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సందీప్‌పాటిల్, ఓబుళాపురం గౌడ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన జాతర

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం, పల్లేపల్లి గ్రామాల మధ్య వెలసిన చౌడేశ్వరీదేవి జాతర బుధవారం వైభవంగా ముగిసింది. జాతర, విందు భోజనాలతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కంబదూరు: ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రేవతి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది రాళ్ల అనంతపురం, నూతిమడుగు, ములకనూరు, రాళ్లపల్లిలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 300 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా విక్రయిస్తున్న వన్నూరప్ప, వన్నూర్‌స్వామిను అరెస్ట్ చేసి 4 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐలు సునీల్‌కుమార్, అన్నపూర్ణ, కృష్ణమూర్తి, ఎస్ఐలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు, బాలకృష్ణ, దామోదర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జంబుకేశ్వరుడి వైభవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో జంబుకేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. సాయంత్రం స్వామివారిని కైలాసవాహనంపై వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా శాంతినగర్ బొడ్డురాయి వరకు ఊరేగించారు. అక్కడి నుంచి తిరిగి స్వామి వారి వాహనం ఆలయానికి చేరుకుంది.

ఇంటర్ పుస్తకాల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డులతో కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు.

వర్షంతో ఉపశమనం

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కూరగాయల మార్కెట్ ఏరియాలో రోడ్డు బురదమయంగా మారింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం కాసింత ఉపశమనం కలిగించింది.

'నా పట్టా రద్దు చేసి...భూమిలేని నిరుపేదలకు పంచండి'

సాక్షి ఎఫెక్ట్..

కళ్యాణదుర్గం: తన పట్టాను రద్దు చేసి... భూమిలేని నిరుపేదలకు భూమిని పంచాలని తగరకుంట గ్రామానికి చెందిన వీఆర్వో తిమ్మయ్య పేర్కొన్నారు. సాక్షిలో బుధవారం ప్రచురితమైన 'వీఆర్వోపై చర్యలు తీసుకోండి' అనే కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు తన అభిప్రాయాన్ని రాతపూర్వకంగా అందజేశారు. తాను కుందుర్పి మండలం జంబుగుంపల గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్నాన్నారు. తమ స్వగ్రామం కనగానపల్లి మండలం తగరకుంటలో తనకు, దాయాదులకు గత కొన్నేళ్లుగా ఆస్తి వివాదం నడుస్తోందన్నారు. భూమి వివాదంలో మా దాయాదులు దళిత సంఘాలను అడ్డుపెట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని తెలిపారు. భూమి వివాదంపై ఎలాంటి కేసులు లేవన్నారు. గత 30 ఏళ్లుగా మా సర్వే నంబర్ 371–2లో 5 ఎకరాలు తాను పట్టా పొందినట్లు తెలిపారు. అయితే సదరు భూమి వల్ల తమకు మనశ్శాంతి లేదని అలాంటి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేదలకు పంచాలని ఆయన కోరారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజు బుధవారం రాయదుర్గం ఆర్టీసీ బస్సు డిపోతోపాటు బస్టాండ్‌ను తనిఖీ చేశారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు, యూనియన్ నేతలతో కలిసి డిపో పరిధిలోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, బస్సులు, డీఎం కార్యాలయం, గ్యారేజీ, బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం గ్యారేజీ కార్మికులతో మాట్లాడారు. బస్సుల కండీషన్, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. డిపో అభివృద్ధి, ఆదాయం పెంపు, ప్రయాణికుల సౌకర్యాలు ఇతరత్ర విషయాలపై డిపో మేనేజర్‌తో చర్చించారు.



గ్యారేజ్ కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

నిస్వార్థ సేవకుడు ఫాదర్ ఫెర్రర్

బొమ్మనహాళ్: నిస్వార్థ సేవకుడు మన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉంతకల్లు, గోవిందవాడ ఎస్సీ కాలనీల్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముక్కన్న, వన్నూరుస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బెళుగుప్ప: బూదివర్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు (72) అనే వృద్ధుడు మొలలు వ్యాధిని భరించలేక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆంజనేయులు ఆరేళ్లుగా మొలలు వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. వ్యాధి తీవ్రతను భరించలేక మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆంజనేయులు గ్రామ సమీపంలోని చింత చెట్టుకు పంచెతో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య లలితమ్మ, కుమారుడు హనుమంతురాయుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ పేర్కొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి

రాయదుర్గంటౌన్: తప్పుల్లేని ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ సహకరించాలని ఈఆర్ఓ ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ఇతరత్ర అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఆర్ఓతోపాటు తహసీల్దార్ నాగరాజు, ఈడీటీ సుజాత, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ తనిఖీ



మాట్లాడుతున్న ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త పూర్ణచంద్రరావు

ఉరవకొండ: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో గత ప్రభుత్వంలో ప్రారంభమైన నియోజకవర్గ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను బుధవారం హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త పూర్ణచంద్రరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి నెలా ఉరవకొండ ల్యాబ్‌కు ఎన్ని శాంపిల్స్ సేకరిస్తున్నారని అఫిషియల్ అనలిస్టు హెచ్.షేకన్నతో ఆరా తీశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. రైతులకు ఎప్పటికప్పుడు ల్యాబ్ రిపోర్టలను అందించాలన్నారు. రిపోర్టులు ఆలస్యం కాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సీడ్ అనలిస్టు శిరీష్ కుమార్, జూనియర్ ఫర్టిలైజర్ అనలిస్టు ఎం.ప్రియాంక పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధి ఉద్యోగులు

కూడేరు: మండల ఉపాధి హామీ పథకం ఇంజినీర్‌గా రాజేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బొమ్మనహాళ్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. అదే విధంగా టెక్నికల్ అసిస్టెంట్‌గా మంజునాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన బ్రహ్మసముద్రం మండలం నుంచి బదిలీపై వచ్చారు. వీరు ఎంపీడీఓ కుళ్లాయి స్వామిని కలిసి రిపోర్ట్ చేసుకున్నారు.

రథం తయారీకి విరాళాలు

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ నూతన రథం తయారీకి విరాళాలు వెల్లువెత్తున్నాయి. బుధవారం కూడేరుకు చెందిన ఈడిగ పూల క్రిష్ణ కుటుంబం రూ.28,116, కటిక శంకరరావు కుటుంబం రూ.25,116, కడదరకుంటకు చెందిన కురుబ రామచంద్ర రూ.25,116 అందజేశారు. ఇంకా పలు గ్రామాలకు చెందిన పలవురు దాతలు సుమారు రూ.2 లక్షల వరకూ విరాళాలు ఇచ్చారు. అనంతరం జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

కూడేరు: మండల పరిధిలోని పి.నారాయణపురంలో బుధవారం సర్పంచ్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆస్పత్రి తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. బీపీ ఎక్కువ ఉన్న వారికి మందులు అందజేశారు. అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలం జాజరకల్లు టోల్‌ప్లాజా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం మొలకాల్మూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తిప్పేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు.. బళ్లారి నుంచి రాంపురం వైపు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు అదే దారిలో మట్టిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ తిప్పేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

బకాయిలు చెల్లించాలి

కుందుర్పి: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు అందాల్సిన పెండింగు బిల్లులను ప్రభుత్వం సత్వరం చెల్లించాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు బుధవారం కుందుర్పి ఎమ్మార్పీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే బదిలీలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రకటించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ కే క్రిష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి చెన్నరాయప్ప, గౌరవాధ్యక్షుడు నారాయణప్ప, ప్రధాన కార్యదర్శి రేవన్న, జిల్లా కౌన్సిల్ జయరాములు, శివలింగప్ప, జే క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేష్

ఉరవకొండ: మహర్షి వాల్మీకి, బోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉరవకొండ పట్టణానికి చెందిన కట్టుబడి సురేష్ నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి వాల్మీకి బోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వాల్మీకుల హక్కుల సాధనకు ఉద్యమాలు చేపడుతామన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేలా దశల వారీ కార్యక్రమాలు చేపడుతామన్నారు.

మూడు నెలలుగా బియ్యం వేయకపోతే ఎలా?



కలగళ్లలో సీఎస్‌డీటీని నిలదీస్తున్న కార్డుదారులు

కూడేరు: బియ్యం సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు అధికారులను నిలదీశారు. ఈ ఘటన బుధవారం కూడేరు మండలం కలగళ్లలో చోటు చేసుకుంది. సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, వీఆర్వో శంకరనారాయణ బుధవారం రేషన్ షాపు దగ్గరకు వెళ్లారు. ఎస్టీ కాలనీకి చెందిన కార్డుదారులు 3 నెలలుగా బియ్యం పంపిణీ చేయలేదని.. అడిగితే 30 క్వింటాళ్ల బఫర్ ఉందని డీలర్ చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా బియ్యం కార్డుదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉంది కదా అని సీఎస్‌డీటీని ప్రశ్నించారు. కార్డుదారులందరికీ సక్రమంగా బియ్యం అందేలా చర్యలు చేపడతామని ఆమె చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.